క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి ఉత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక పండరీపురం ఒకటో వీధిలోని శ్రీకోదండ రామాలయంలో గల శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయ 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహారాధన, అంకురారోపణ, యాగశాల ప్రవేశం తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పూజల్లో గొల్లపూడి రామకృష్ణారావు, జయలక్ష్మి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాల్ని బ్రహ్మండం శేషగంగాధరశర్మ పర్యవేక్షించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

విజ్ఞాన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎండీ ఫయాజ్ అహ్మద్‌కు అలహాబాద్‌లోని మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పీహెచ్‌డీ పట్టా అందజేసింది. ఈ మేరకు విజ్ఞాన్ యూనివర్సిటీ వీసీ పి.నాగభూషణ్ బుధవారం తెలిపారు. ''డెవలప్‌మెంట్ ఆఫ్ స్మార్ట్ క్వాడ్‌కాప్టర్ ఫర్ ఇన్‌స్పెక్షన్ ఆఫ్ ఓవర్‌హెడ్ పవర్ ట్రాన్స్‌మిషన్ లైన్స్'' అనే అంశంపై ఫయాజ్ అహ్మద్ పరిశోధన చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఫయాజ్ అహ్మద్‌ను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

పేద కుటుంబాలకు 'ఉపాధి' లక్ష్యం

పెదకాకాని: ఉపాధి హామీ పథకం ద్వారా పేద కుటుంబాలకు పనులు కల్పించాలని రాష్ట్ర పంచాయతీ, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ బి.రాజశేఖర్ ఆదేశించారు. పెదకాకాని మండలం కొప్పురావూరులో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గానూ బుధవారం ప్రారంభించిన పనుల్ని ఆయన పరిశీలించారు. పనుల అంచనా, కూలీల సంఖ్యతో మస్టర్‌ను పని ప్రదేశంలోనే ఆన్‌లైన్ చేయాలని సిబ్బందికి చెప్పారు. పని ప్రదేశంలో పంట కాలువ పూడవు, వెడల్పు, లోతులను స్వయంగా పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమావేశమయ్యారు. మండలంలో గుర్తించిన పనులు, వ్యయం అంచనాపై చర్చించారు. పనుల నిర్వహణ, మస్టర్, వేతనాల మంజూరు వంటి అంశాల్లో వ్యత్యాసం కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా పనుల్లేక ఇళ్ల వద్ద ఉంటున్న పేదలకు కార్డులు మంజూరు చేసి పని కల్పించాలని సూచించారు. కూలీల సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ డైరెక్టర్ చిన తాతయ్య, ఎన్ఆర్ఈజీఎస్ పీడీ యుగంధర్, ఎంపీడీఓ బి.వి. మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌నకు ఇద్దరి ఎంపిక



గుంటూరు రూరల్: నల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయురాలు బి. విజయలక్ష్మి తెలిపారు. పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందనలో ఆమె మాట్లాడారు. ఎనిమిదో తరగతి విద్యార్థులు బి. హారిక, షేక్ నౌషద్‌అలీ స్కాలర్‌షిప్‌కు ఎంపిక వ్వడం గ పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సైతం కార్పొరేట్ పాఠశాలకు ఏమాత్రం తీసిపోరని నిరూపించారని తెలిపారు. విద్యార్థుల్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

సెల్ టవర్ ఎక్కిన డీఎస్సీ క్వాలిఫైడ్ టీచర్లు

మంగళగిరి: తమకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని 1998 క్వాలిఫైడ్ టీచర్లు ఇద్దరు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. కడపకు చెందిన రాజు, నెల్లూరుకు చెందిన శ్రీనివాస్ బుధవారం నగర పరిధిలోని ఎన్నారై జంక్షన్‌లోని సెల్ టవర్‌ను ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఉదయం 11 గంటల సమయంలో సెల్ టవర్ ఎక్కిన రాజు, శ్రీనివాస్‌లు సాయంత్రం 6 గంటలకు అధికారులు ఇచ్చిన హామీ మేరకు కిందికి దిగారు. వారితో తహసీల్దార్ జీవీ రామ్ ప్రసాద్, నార్త్‌జోన్ డీఎస్పీ జె.రాంబాబు, ఎంఈఓ సత్యనారాయణ, పట్టణ సీఐ అంకమ్మరావు, పెదకాకాని సీఐ సురేష్‌బాబు చర్చించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్ పాలన

ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి



స్థానికుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్న ఎంపీ అయోధ్యరామిరెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, డెప్యూటీ మేయర్లు బాలవజ్రబాబు, సజిల తదితరులు

పట్నంబజారు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాటుపడుతున్నారని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 50 డివిజన్ శారదా కాలనీలో బుధవారం డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు ఆధ్వర్యంలో మా నమ్మకం నువ్వే జగన్ - జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ నేతలు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు వివరించడంతోపాటు, వారి అభిప్రాయాలు సేకరించారు. ప్రతి ఇంటికీ యజమానుల అంగీకారంతో డోర్ స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఎంపీ అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి పూర్తి స్థాయిలో అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. మంచి చేస్తేనే ఓటు వేయండి అనే దమ్ముగల నాయకుడు సీఎం జగన్ అని స్పష్టం చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజల్ని పట్టించుకోని పరిస్థితులు ఉన్నాయని, ఎన్నో ఇబ్బందులు పడ్డ వైనాన్ని ఒక్కసారి అన్ని వర్గాల ప్రజలు గుర్తించాలని తెలిపారు. రానున్న రోజుల్లో మరోమారు సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి అపూర్వ స్పందన లభిస్తోందని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు మరో 30 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌నే కోరుకుంటున్నారని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా పూర్తి స్థాయిలో హామీల్ని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతోందని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ షజిల, తూర్పు నియోజకవర్గ మహిళ నేత నూరి ఫాతిమా, మెహబూబ్, వైఎస్సార్ సీపీ నేతలు రాజేష్, ఆలా కిరణ్, కొండమ్మ, విజయ్, హరినారాయణ, కోటా కుమార్, నరేష్ పాల్గొన్నారు.

ప్రజలకు సత్వరమే సేవలందించాలి

సచివాలయాల అడ్మిన్ కార్యదర్శుల సమావేశంలో ఎమ్మెల్యే ముస్తఫా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వరమే సేవలందించి మంచి పేరు తీసుకురావాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియంలోని తన కార్యాలయంలో బుధవారం సచివాలయాల అడ్మిన్ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఈ సదర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ అన్ని సేవల్ని సచివాలయాల ద్వారానే అందిస్తున్న నేపథ్యంలో అడ్మిన్ కార్యదర్శులు ఎంతో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలతో మర్యాదగా నడుచుకుంటూ వారికి కావాల్సిన సేవల్ని అందజేయాలని చెప్పారు. సమస్యల్ని నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి గానీ, తన దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు అడపా శేషుబాబు, మహిళ నేత నూరిఫాతిమా పాల్గొన్నారు.

గ్రామీణ వ్యవస్థకు పంచాయతీ రాజ్ వ్యవస్థ మూల స్తంభం

గుంటూరు వెస్ట్: గ్రామీణ వ్యవస్థకు పంచాయతీ రాజ్ వ్యవస్థ మూల స్తంభమని అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు తెలిపారు. స్థానిక ఇన్నర్ రింగ్ రోడ్డులోని సంస్థ క్యాంప్ కార్యాలయంలో బుధవారం 65వ పంచాయతీ పరిషత్ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ సంస్థల బలోపేతానికి రాజ్యాంగంలో 73వ సవరణ జరిగి దశాబ్దాలు గడుస్తున్నా అధికారాలు బదిలీ చేయడం లేదని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు బల్వంత్ రాయ్ మెహతా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్యూఆర్ కోడ్ ప్రక్రియ వేగవంతం చేయండి

పట్టణ ప్రణాళిక అధికారుల సమావేశంలో కమిషనర్



పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశమైన కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో ప్రకటనల బోర్డులకు క్యూఆర్ కోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారుల్ని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో బుధవారం పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కోడ్ స్కాన్ చేస్తే ఏజెన్సీ పేరు, లొకేషన్, బకాయి వివరాలు వస్తాయన్నారు. ప్రణాళిక అధికారులు కూడా క్షేత్రస్థాయిలో కోడ్ ఏర్పాటుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు చెల్లించని వారి బోర్డులు తొలగించడంతోపాటు వసూళ్లకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విస్తరణ పూర్తయిన పెద్దపలకలూరు, నందివెలుగు, కుష్ఠర్ హాస్పిటల్, ఏటీ అగ్రహారం ప్రాంతాల్లో డ్రైన్ల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. విస్తరణ జరిగిన ప్రాంతాల్లో టీడీఆర్ బాండ్లు ఇవ్వడానికి ఆధార్ సీడింగ్, ఇతర సాంకేతిక పనులు పూర్తి చేయాలని టీపీఎస్‌లను ఆదేశించారు. కోర్టు కేసుల్లో కౌంటర్లు, అఫిడవిట్లు పక్కాగా నమోదు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశంలో సిటీప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీప్లానర్లు మూర్తి, కోటయ్య, ఏసీపీలు కాలేషా, బాబూరావు, అజయ్ కుమార్, సర్వేయర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

గాంధీ పార్కు అభివృద్ధి పనుల పరిశీలన

గాంధీ పార్కు పెండింగ్ పనుల్ని వేగంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఆమె బుధవారం పార్కులో పనుల్ని తనిఖీ చేశారు. కళాకృతుల్ని మరింత సుందరంగా తీర్చిదిద్దాలని చెప్పారు. పనుల్లో జాప్యం జరుగుతోందని, నిర్దేశిత గడువులోగా కాంట్రాక్టర్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చెప్పారు. అవసరమైతే షిఫ్టుల వారీగా పనులు చేపట్టాలని ఆదేశించారు. పార్కులో లైటింగ్‌పై ఈఈకి పలు సూచనలు చేశారు. పచ్చదనం పెంపుపై మరింత దృష్టి సారించాలని ఏడీహెచ్‌కి చెప్పారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గుంటూరు నగర నడిబొడ్డున ఉన్న గాంధీ పార్కును నగరానికే తలమానికంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆహ్లాదాన్ని అందించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈఈలు కోటేశ్వరరావు, కొండారెడ్డి, సుందరరామిరెడ్డి, డీఈఈ శ్రీనివాసరెడ్డి, ఏడీహెచ్ రామారావు, ఏఈలు రాంబాబు, రవికిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటోలో ఇరుక్కుపోయిన ఇరువురు వ్యక్తులు

మంగళగిరి: నగర పరిధి చినకాకాని ఎన్నారై జంక్షన్ వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. పెదకూరపాడు నుంచి మిర్చి లోడుతో విజయవాడ బయలుదేరిన ఆటో ఎన్నారై వై జంక్షన్ వద్దకు వచ్చే క్రమంలో అదుపుతప్పి ఎదురుగా ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జు నుజ్జు కాగా ఆటో డ్రైవర్ గోపితో పాటు మరో వ్యక్తి క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. గమనించిన స్థానికులు ఆటోలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి చికిత్స నిమిత్తం ఎన్నారై ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పట్టణ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాద వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వేర్వేరు చోట్ల మనస్తాపంతో ఇద్దరి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: నగరంలో వేర్వేరు చోట్ల మనస్తాపంతో ఇద్దరి ఆత్మహత్య చేసుకున్నారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవానీపురానికి చెందిన తిరుమలకొండ ఆంజనేయులు (59) భార్య మృతి చెందడంతో ఒంటరిగా నివసిస్తున్నాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ మానసికంగా కృంగిపోయాడు. బుధవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● వృద్ధుడు ఆత్మహత్య చేసుకుని మృతిచెందిన సంఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రత్నపురికాలనీకి చెందిన ఎం.వెంకటేశ్వరరావు (67) గతంలో భార్య మృతి చెందడంతో ఒంటరిగా ఉంటున్నాడు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మానసికంగా కృంగిపోయి బుధవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ యత్నం కేసులో జైలుశిక్ష

గుంటూరు లీగల్: దొంగతనానికి ప్రయత్నించిన నిందితుడికి ఎనిమిది నెలల జైలు శిక్ష విధిస్తూ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి జి.స్పందన బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ఈ ఏడాది ఫిబ్రవరి 27న కొబాల్ట్‌పేటకు చెందిన కర్నాటక శివాజీ బ్రాడీపేటలోని యాగంటి నెస్ట్ అపార్ట్‌మెంట్‌లో గేటుకు ఉన్న తాళం పగులగొట్టి చోరీకి ప్రయత్నించాడు. ఆ సమయంలో అక్కడి వాచ్‌మేన్ అతడ్ని పట్టుకుని పట్టాభిపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు నిందితుడ్ని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సీఐ రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో ఎస్.ఐ కృష్ణబాజీ దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్ష్యాధారాలతో కోర్టులో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ ఎస్.శౌరీ కేసును వాదించారు.

అలరిస్తున్న సాంఘిక నాటికలు



గ్రహణం నాటికలో సన్నివేశం

నగరంపాలెం: కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్‌లో వైకే నాగేశ్వరరావు స్మారక ద్వితీయ నాటకోత్సవాలు రెండో రోజుకి చేరాయి. ప్రగతి కళా మండలి అధ్యక్షుడు నూతలపాటి సాంబయ్య, ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షుడు అన్నమనేని ప్రసాద్, కళా విపంచి గౌరవాధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు బుధవారం రాత్రి జ్యోతి ప్రజ్వలన చేసి నాటికల్ని ప్రారంభించారు. కైకాల సత్యనారాయణ, తమ్మారెడ్డి చలపతిరావు కళా ప్రాంగణంలో తొలుత విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో సింహ ప్రసాద్ రచన, బి.ఎం.రెడ్డి దర్శకత్వం వహించిన గ్రహణం నాటిక ప్రదర్శించారు. అనంతరం యల్లాప్రగడ భాస్కరరావు రచన, సారథ్యంలో వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వం వహించిన రసఝురి పొన్నూరు వారి కాపలా నాటిక ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కళాకారులు, అతిథులను కళా విపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు, రామకృష్ణప్రసాద్ సత్కరించారు.

పోలేరమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ



అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు

కొండపాటూరు(కాకుమాను): మండలంలోని కొండపాటూరులో శ్రీపోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం రెండవ రోజు బుధవారం భక్తులతో దేవాలయం కిటకిటలాడింది. అమ్మ వారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఏర్పాట్లను దేవాలయ చైర్మన్ రామినేని నాగవేణి, తిరుపతిరావు దంపతులు, ఈవో సురేష్‌బాబు పర్యవేక్షించారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన వివిధ రకాలు దుకాణాలు మహిళలతో కిటకిటలాడాయి. అమ్మ వారి దర్శనం అనంతరం భక్తులు భారీగా వంట సామగ్రి కొనుగోలు చేశారు.

నేడు హుండీ లెక్కింపు

పోలేరమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు గురువారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఈఓ సురేష్‌బాబు తెలిపారు. ఆలయ చైర్మన్, దేవదాయ అధికారుల సమక్షంలో నిర్వహించనున్న కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు తెనాలిలో జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

తెనాలి అర్బన్: భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని గురువారం తెనాలిలో నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. చెంచుపేట ఇందిరానగర్ కాలనీలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేష్ మాదిగ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రపండు కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య

పెదనందిపాడు: స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాలలో బుధవారం ఉదయం కాటూరి మెడికల్ కళాశాల, హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన కాటూరి సుబ్బారావు వైద్య కళాశాలను నెలకొల్పి, వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. మున్ముందు గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించి సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. శిబిరంలో వైద్యులు మూడు వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాటూరి మెడికల్ కళాశాల ఎండీ డాక్టర్ స్పైరారావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చల్లా మోహన్‌రావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. సుబ్బారావు, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, పీఏఎస్ కళాశాల ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, పీపీ పాతూరి శ్రీనివాస్, దాసరి శేషగిరిరావు, ముద్దన రాఘవయ్య, పి. లక్ష్మీనారాయణ, కెఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు చేయూత



పంపిణీ చేసిన గొడుగుతో శివశంకర్, కుమార్ తదితరులు

తెనాలి అర్బన్: సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వ్యవస్థాపకులు తన్నీరు శివశంకర్ ఆధ్వర్యంలో శివాజీ చౌక్‌లో రోడ్డుపై చెప్పులు కుట్టుకునే ఏసురత్నానికి రూ.2,500 విలువ చేసే గొడుగును బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో నటరాజ్ జ్యూయలరీస్ అధినేత కొత్త మాసు కుమార్, సంస్థ సభ్యులు మాలేపాటి హేమ కుమార్, పేటేటి రవి కుమార్, ముద్దాభక్తుని రమణయ్య, చుక్కా భానుప్రసాద్, అడపా సంపత్ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

● నాజరుపేటకు చెందిన నిరుపేద బ్రాహ్మణుడు వావిలాల మోహనరావు బుధవారం మృతి చెందాడు. అంత్యక్రియలు చేసే ఆర్థిక స్తోమత వారికి లేకపోవడంతో అతని కుటుంబ సభ్యులు సత్యం, శివం, సుందరం సామాజిక సేవా కేంద్రం వారిని సంప్రదించారు. వారి సహకారంతో ఆదిత్య రెస్టారెంట్ అధినేత వేముల రామకృష్ణ రూ.3,100ను మృతుని కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో తన్నీరు శివశంకర్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

డెప్యూటీ తహసీల్దార్ కుమార్తెకు ఉద్యోగం



అనుహ్యాకు నియామక ఉత్తర్వులను అందజేస్తున్న తహసీల్దార్ రవిబాబు

తెనాలి రూరల్: విధి నిర్వహణలో ఉండగా తీవ్ర అస్వస్థతకు గురై విధులకు హాజరుకాలేని స్థితిలో ఉన్న రెవెన్యూ శాఖ అధికారి కుమార్తెకు ఉద్యోగాన్ని ఇస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తెనాలి డివిజన్ డెప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సమయంలో బాలాజీసింగ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పరీక్షించిన వైద్యులు బ్రెయిన్ పెరాలసిస్ అని చెప్పారు.

విధులకు హాజరుకాలేని స్థితిలో ఉన్న బాలాజీసింగ్ పరిస్థితిని రెవెన్యూ ఉద్యోగుల జిల్లా సంక్షేమ సంఘ సభ్యులు, మెడికల్ ఇన్వాలిడేషన్ బోర్డ్, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీఆర్వో, తెనాలి సబ్ కలెక్టర్, తహసీల్దార్ గుర్తించారు. బాలాజీసింగ్ కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇవ్వచ్చనే నిర్ణయానికి వచ్చి, ఆ మేరకు బాధితుడి రెండో కుమార్తె అనుహ్యాకు రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వాటిని ఆమెకు తహసీల్దార్ కె. రవిబాబు బుధవారం అందజేశారు.

మోదీని గద్దె దించేందుకు 21 పార్టీలు ఏకం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రామకృష్ణ



మాట్లాడుతున్న ఏఎస్ రామకృష్ణ. పక్కన ముప్పాళ్ల నాగేశ్వరరావు

తెనాలి: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దించటానికి దేశంలోని 21 పార్టీలు ఏకమవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడించారు. కేంద్రప్రభుత్వం దుష్టచర్యలను వామపక్షాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సంయుక్త ఆధ్వర్యంలో తెనాలిలో జరుగుతున్న రచయితలు, కళాకారుల మూడురోజుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. చివరిరోజు కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుతో కలిసి రామకృష్ణ పాల్గొన్నారు. కళాకారుల కళాప్రదర్శనలను తిలకించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలనను దుయ్యబట్టారు. 'ఇప్టా' జాతీయ కార్యదర్శి గని, ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, రాష్ట్ర కార్యదర్శి చెన్నం పెంచలయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామకృష్ణ, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, సీపీఐ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు తదితరులు శిక్షణ తరగతుల్లో మాట్లాడారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



దేవకుమార్ కుమారుడికి నగదు అందజేస్తున్న డీఎస్పీ

తెనాలి రూరల్: పట్టణంలో విధులు నిర్వహిస్తూ ఇటీవల మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి పోలీసులు ఆర్థిక సాయం చేశారు. సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామానికి చెందిన గొట్టిముక్కల దేవకుమార్(48) తెనాలిలో కుటుంబంతో కలిసి ఉంటూ హోంగార్డుగా ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్నాడు. గత నెల 27న గుండెపోటు రావడంతో దేవకుమార్‌ను కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే ఆయన మరణించినట్టు వైద్యులు తెలిపారు.ఈ నేపథ్యంలో తెనాలి వన్‌టౌన్ సర్కిల్ సీఐ కె.చంద్రశేఖర్, సిబ్బంది దేవకుమార్ కుటుంబం కోసం రూ. 64 వేలు సమకూర్చారు. నగదును డీఎస్పీ స్రవంతిరాయ్ చేతుల మీదుగా దేవకుమార్ కుమారుడికి బుధవారం అందజేశారు.